


మత సామరస్యానికి చిహ్నం
కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై హిందూ, ముస్లింల సమైక్యతకు చిహ్నంగా చెప్పే బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది.

8లో



భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం
కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో జరిగిన అపచారంపై నిందితులను శిక్షించాలని వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు.

9,745 క్యూసెక్కులు విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,745 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 అర్జీలు



అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 27 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. వారి సమస్యల పరిష్కారానికి ఎస్పీ నిర్ణీత గడువు ఇచ్చి ఆ లోపు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు భరోసా ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో సీఐ, ఎస్సైలకు ఫోన్లు చేసి వచ్చిన ఫిర్యాదులపై చర్చించి వాటి పరిష్కారానికి పలు సూచనలు ఇచ్చారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే అనర్థం

- ట్రాన్స్‌కో అధికారులను సస్పెండ్ చేయాలి
- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్



అల్లవరం: మండలంలోని గోడి కొత్త కాలనీలో విద్యుదాఘాతానికి కేతా లాస్యమాధురి చేతిని కోల్పోవడం చాలా బాధాకరమని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. సోమవారం విద్యుత్ ప్రమాద ఘటన జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందన్నారు. డాబాకు విద్యుత్ వైర్లు తగులుతున్నాయని, వాటిని మార్చాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే చిరంజీవి లాస్యకు తీవ్ర నష్టం జరిగిందని, ఆ నష్టాన్ని ఎవరూ తీర్చలేనిదన్నారు. జీవితాంతం వికలాంగురాలిగా జీవించాల్సిన దయనీయ పరిస్థితిని అధికారులు తెచ్చారన్నారు. ఈ ఘటనకు కారకులైన ట్రాన్స్‌కో డీఈఈ, ఏఈ, లైన్‌మెన్లను విధుల నుంచి తప్పించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. అంతేకాకుండా వారి కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారం అందజేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సరిచేయాలన్నారు. బాధిత చిన్నారి లాస్యమాధురి, ఆమె తల్లి రమాదేవికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నాతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలను కలుపుకొని, త్వరలోనే అల్లవరం విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

హోరాహోరీగా బ్రాహ్మణ పురోహిత క్రికెట్ పోటీలు



ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న టౌన్ సీఐ వీరబాబు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం జరిగిన మ్యాచ్‌లో నర్సీపట్నంపై అన్నవరం గెలిపొందింది. రెండో మ్యాచ్‌లో వైజాగ్ లైన్స్ జట్టుపై కాకినాడ రుద్రాస్ గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో కాత్రేనికోనపై నర్సీపట్నం విజయం సాధించింది. క్రీడాకారులకు ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను పట్టణ టౌన్ సీఐ వీరబాబు అందించారు. పట్టణ పురోహితులు కర్ర శివయ్య, పిండి మూర్తి, వేదుల భరద్వాజ్‌శర్మ, నిర్వాహకుడు ఉప్రదిష్ట నాగఆదిత్య, విజయఆదిత్య, విగ్రమ్‌ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో వచ్చే నెల 4 నుంచి 13వ తేదీ వరకూ జరిగే స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌తో కొత్తపేటకు చెందిన గరగ, వీరనాట్యం బృందం



అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన గరగ నృత్య బృందం

నృత్యనూతనంగా...

- ప్రాచీన కళకు వన్నెతెచ్చిన కళాకారులు
- ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో 'కోనసీమ గరగ నృత్యం'
- రిపబ్లిక్ డే పరేడ్‌లో జిల్లా నాట్య బృందాల ప్రాతినిధ్యం
- కొత్తపేట, అంబాజీపేట కళాకారుల ఎంపిక

సాక్షి, అమలాపురం/ కొత్తపేట/ అంబాజీపేట: కళ ఏదైనా, దానికి వన్నె తెచ్చే కళాకారులు ఉంటే నిత్య నూతనంగా విరాజిల్లుతోంది.. ప్రాచీన జానపద నృత్యాల్లో ఓ ప్రత్యేకమైన గరగ నృత్యం మన కళాకారుల చేతుల్లో నిత్యనూతనంగా జీవం పోసుకుంటోంది.. అందుకే ఢిల్లీలో ఈ నెల 26న గణతంత్ర వేడుకల్లో భాగంగా కర్తవ్య పథ్‌లో కోనసీమకు చెందిన గరగ నృత్యం, వీర నాట్య కళాకారులు పాల్గొనే అవకాశం వరించింది. ఆ రోజు దేశ రాజధానిలో జరిగే కవాతును స్వయంగా చూడాలని దేశంలో ప్రతి పౌరుడు కోరుకుంటాడు. ఈ కవాతులో పాల్గొనే అవకాశం వస్తే తమ అదృష్టంగా భావిస్తారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే వీర జవాన్లు.. దేశం తరఫున ఆడే క్రీడాకారులతో పాటు ప్రతిభావంతులైన కళాకారులకు మాత్రమే ఆ భాగ్యం దక్కుతుంది. ఇందులో మన కళాకారులు ఉండడం నిజంగా అదృష్టం. రాష్ట్ర వ్యాప్తంగా గరగ నృత్య కళాకారులు ఉన్నా.. కోనసీమ కళాకారుల ప్రదర్శన ప్రత్యేకతను చాటుతోంది. అమెరికా, యూకే వంటి దేశాల్లో తెలుగు సంఘాల వారు నిర్వహించే కార్యక్రమాల్లో సైతం గరగ నృత్య కళాకారులు తమ ప్రతిభ చూపారు. దేశ గణతంత్ర వేడుకల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కవాతులో ఏటా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వివిధ గరగ నృత్యం, వీర నాట్య బృందాలు ప్రదర్శనకు వెళ్తుంటాయి. అలాంటి ఈ కర్తవ్య పథ్‌లో ఈ ఏడాది నిర్వహించే పరేడ్‌కు సైతం గరగ నృత్యం, వీర నాట్య ప్రదర్శనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రెండు బృందాలు ఎంపికయ్యాయి. దేశ వ్యాప్తంగా 29 జానపద, 22 గిరిజన కళారూపాల బృందాలు నిర్వహించే ప్రదర్శనల్లో జిల్లా బృందం పాల్గొననుంది. సుమారు 5 వేల మంది కళాకారులు ఉండగా, ఇందులో మనవారు 100 కావడం విశేషం. ప్రముఖ సింగర్ శంకర్ మహాదేవన్ రచించే పాటకు వీరు నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఇందులో కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన గరగ నృత్యం, వీర నాట్యం కళాకారుడు కొమారిపాటి ఏసు వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో 61 మంది, అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన పసుపులేటి అయ్యప్పస్వామి బృందం ఆధ్వర్యంలో 28 మంది పాల్గొనున్నారు. ఈ కళాకారులు గత నెలలోనే ఢిల్లీకి చేరుకున్నారు. 26న గణతంత్ర దినోత్సవంలో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. వీరిలో ఏసు వెంకటప్రసాద్ బృందం మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ నుంచి ప్రశంసలందుకుంది. దుబాయ్‌లో వీరి ప్రదర్శన జరిగింది. 2021 రిపబ్లిక్ డే సందర్భంగా న్యూ ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున లేపాక్షి నంది శకటంలో 12 మంది కళాకారులు పాల్గొన్నారు. ఏసు వెంకట ప్రసాద్ తండ్రి, తాషా వాయిద్య విద్వాంసుడు కొమారిపాటి వెర్రియ్య 2003లో అమెరికా తానా సభల్లో ప్రదర్శన ఇచ్చారు. అయ్యప్ప స్వామి తండ్రి వెంకటేశ్వరరావు 2010లో కవాతులో పాలొన్నారు.



న్యూ ఢిల్లీలో మాస్టర్స్‌తో కలసి రిహార్సల్ చేస్తున్న ఏసు వెంకటప్రసాద్ బృందం

నాగబాబు బృందానికి మూడోసారి..

గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ శకటం వద్ద ప్రదర్శన ఇచ్చేందుకు ముక్కామల గ్రామానికి చెందిన పసుపులేటి నాగబాబు బృందానికి మూడోసారి అవకాశం లభించింది. 16 మంది సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ శకటం ఏటికొప్పాక బొమ్మలు (ఎకో ఫ్రెండ్లీ) థీమ్‌తో ప్రదర్శించే శకటం ముందు సంప్రదాయ నృత్యాలు చేయనున్నారు. నాగబాబు బృందం తొలిసారిగా 2023లో రాష్ట్ర ప్రభుత్వ అక్షరాస్యత శకటం, 2024లో జరిగిన వేడుకల్లో ఏకాదశ రుద్రుల ప్రభల శకటం ముందు గరగ నృత్య ప్రదర్శన చేశారు.

చాలా సంతోషంగా ఉంది



దేశ విదేశాల్లో ఎన్నోసార్లు గరగ నృత్యం, వీరనాట్యం ప్రదర్శించాం. కానీ రిపబ్లిక్ డే వేడుకలకు మా కళాకారులను తీసుకువెళ్లడం చాలా సంతోషంగా ఉంది. మా బృందం తరఫున 61 మంది పాల్గొనే అవకాశం దక్కడం అదృష్టం. శంకర మహాదేవన్ రచించిన పాటకు నృత్యం చేయనున్నాం.

– కొమారిపాటి ఏసు వెంకటప్రసాద్, పలివెల, కొత్తపేట మండలం

అవకాశం రావడం అదృష్టం



గణతంత్ర వేడుకలకు మాకు తొలిసారి ఆహ్వానం రావడం ఆనందంగా ఉంది. 14 ఏళ్ల కిందట నా తండ్రి పాల్గొంటే.. ఇప్పుడు గరగ నృత్యం ప్రదర్శనకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఏదేమైనా జిల్లా సత్తా చాటుతాం.

– పసుపులేటి అయ్యప్పస్వామి, ముక్కామల, అంబాజీపేట

రిహార్సల్స్ చేస్తున్నాం..



ఆంధ్రప్రదేశ్ శకటంతో పాటు గరగ ప్రదర్శన ఇచ్చే అవకాశం వరుసగా మూడోసారి దక్కింది. ఏటా రాష్ట్రంలో గుర్తింపు పొందిన ఒక అంశంపై రూపొందించిన శకటం వెంట ప్రదర్శనగా వెళ్లడం మా అదృష్టం. ఇప్పటికే ముమ్మరంగా రిహార్సల్స్ చేస్తున్నాం.

– పసుపులేటి నాగబాబు, ముక్కామల, అంబాజీపేట మండలం

బేరమాడి... బ్యాగ్‌తో ఉడాయించి

బియ్యం దుకాణంలో చాకచక్యంగా చోరీ

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డు షాదీఖానా సమీపంలో ఓ బియ్యం దుకాణానికి బైక్‌పై వచ్చిన ఇద్దరు బియ్యం బేరమాడుతూనే చాకచక్యంగా చోరీకి పాల్పడ్డారు. బియ్యం దుకాణ యజమాని అరిగెల నాని సోమవారం ఉదయం అప్పుడే దుకాణం తెరిచి సర్దుకుంటున్నారు. అప్పటికే దుకాణ యజమాని తన వెంట వైర్ బ్యాగ్‌లో రూ.50 వేలు తెచ్చి టేబుల్‌పై ఉంచారు. ఇంతలో ఇద్దరి కుర్రాళ్లు బైక్‌పై వచ్చి బియ్యం కావాలంటూ బేరం ఆడారు. దుకాణ యజమానిని మాటల్లో పెట్టి నగదుతో ఉన్న బ్యాగ్‌ను ఆ యువకులు పట్టుకుని అక్కడి నుంచి ఉడాయించారు. వారు వెళ్లాక సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తే ఆ ఇద్దరు అస్పష్టంగా ఉండడంతో గుర్తు పట్టలేకపోయారు. దీంతో దుకాణ యజమాని ఆ సీసీ పుటేజీని పట్టణ సీఐ పి.వీరబాబు వద్దకు తీసుకుని వెళ్లి చూపించడంతోపాటు ఫిర్యాదు చేశారు. పోలీసు తరఫు నుంచి కూడా పరిసర దుకాణాలు, రోడ్డు ప్రాంతాల సీసీ పుటేజీలను సేకరించి దర్యాప్తు చేస్తామని సీఐ వీరబాబు తెలిపారు.

ప్రయాగరాజ్‌కు మరో ప్రత్యేక రైలు నడపండి

కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు ఎంపీ శ్రీనివాస్ లేఖ



సాక్షి ప్రతినిధి,కాకినాడ: ప్రయాగరాజ్‌లో జరుగుతోన్న మహా కుంభమేళాకు కాకినాడ టౌన్‌రైల్వేస్టేషన్ నుంచి అదనంగా మరో ప్రత్యేక రైలు సర్వీసులు నడపాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కేంద్రం రైల్వేశాఖమంత్రి అశ్వినివైష్ణవ్‌కు ఈ మేరకు సోమవారం రాసిన లేఖ ప్రతులను ఇక్కడ మీడియాకు విడుదల చేశారు. వచ్చే నెల 26 వరకు జరుగుతోన్న మహాకుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరువుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో కేంద్రమంత్రికి చేసిన విజ్ఞప్తితో కాకినాడ టౌన్ నుంచి ఫిబ్రవరి 20న ప్రయాగరాజ్‌కు నేరుగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఈ ఒక్క రైలు జిల్లా నుంచి వెళుతోన్న భక్తుల రద్దీకి ఎంత మాత్రం సరిపోదని ఆ లేఖలో వివరించారు.

తవ్వేస్తూ.. తరలిస్తూ..



యర్రంశెట్టివారిపాలెం వద్ద అనధికారికంగా ఇసుక, మట్టి ర్యాంపు

- లంక భూములను కొల్లగొడుతున్న వైనం
- పెద్ద ఎత్తున ఇసుక, మట్టి తవ్వకాలు

పి.గన్నవరం: భూ బకాసురులు చెలరేగిపోతున్నారు.. పి.గన్నవరం మండలంలో ఇసుక, మట్టిని అక్రమంగా తవ్వుకుపోతున్నారు. నదీ గర్భాన్ని కొల్లగొట్టి దొరికినంత దోచుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా కూటమి నేతల ఆధ్వర్యంలో ఈ తంతు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. విలువైన లంక భూములకు ప్రమాదం వాటిల్లుతున్నా ఎవరూ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే స్థానిక డీఎస్‌పాలెం, ఎల్.గన్నవరం తదితర ప్రాంతాల్లో ఉచిత ఇసుక మాటున కూటమి నేతలు అక్రమ తవ్వకాలు సాగిస్తూ పెద్ద ఎత్తున దోచుకుంటున్న విషయం విదితమే. తాజాగా మండలంలోని యర్రంశెట్టివారిపాలెం వద్ద మరో ఇసుక ర్యాంపు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా రెండు రోజుల నుంచి ఇక్కడ ఇసుక, తువ్వ మట్టి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ నాయకుడి ముగ్గురు అనుచరులు ఈ ర్యాంపును నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఇక్కడి నుంచి టిప్పర్లపై అమలాపురం తదితర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక, తువ్వ మట్టిని తరలిస్తున్నారు.



ఊడిమూడిలంక నుంచి మట్టితో వెళ్తున్న టిప్పర్ లారీ

ఇదిలాఉంటే రైతులకు ప్రయోజనం పేరుతో ఊడిమూడిలంక వద్ద నదీపాయపై అక్రమార్కులు ఇటీవల లంకలోకి బాట ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా ఈ లంక భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ దందా సాగుతోంది. ఊడిమూడిలంక నుంచి నదీపాయలో బాట మీదుగా టిప్పర్లు ఏటిగట్టుకు వస్తున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఏటిగట్టుపై ప్రయాణించి జి.పెదపూడి వంతెన మీదుగా రావులపాలెం వైపు టిప్పర్ల ద్వారా లంక మట్టిని తరలిస్తున్నారు. నియోజకవర్గ నేతల మద్దతుతో ఈ ర్యాంపు నడుస్తుండటంతో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ మట్టి దందాపై స్థానికులతోపాటు, పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమన్వయంతో కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అంతా సమన్వయంతో సాగాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సోమవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అదనపు డీఎంహెచ్‌ఓ సీహెచ్ వి.భరత్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించండి

ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు శివశంకర్ ప్రసాద్, మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి అర్జీదారుల నుంచి సుమారు 199 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో బాధ్యతా రాహిత్యానికి తావులేకుండా చూడాలన్నారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో పరిష్కారం కావాల్సిన సమస్యల గురించి అర్జీదారులు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, దీనివల్ల వారికి డబ్బు, సమయం వృథా అవుతుందన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

బుక్ ఓపెన్ చేయకుండా పరీక్షలా!

- నేటి వరకూ ఓపెన్ విద్యార్థులకు అందని స్టడీ మెటీరియల్
- రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా పరీక్షల నిర్వహణకు ప్రయత్నం

రాయవరం: పుస్తకాలు ఇంకా ఇవ్వలేదు.. పాఠ్యాంశాలు పూర్తి కాలేదు.. ఇప్పుడేమో పరీక్షలంటూ ప్రయత్నాలు చేసేస్తున్నారు. దీంతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్ కట్టిన విద్యార్థులు గందరగోళంలో పడ్డారు. ఏటా మార్చిలో రెగ్యులర్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు జరుపుతుంటాయి. ఈ మేరకు ఆ నెల 17 నుంచి నిర్వహించేందుకు బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ ఇప్పటికే షెడ్యూల్ ఇచ్చింది. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు మార్చి 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటన చేసింది. ఇప్పుడు రెగ్యులర్ పది, ఇంటర్ పరీక్షలతో పాటు, ఓపెన్ స్కూల్ ద్వారా విద్యనభ్యసించే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ కసరత్తు చేస్తుంది. గతానికి భిన్నంగా ఇలా ప్రయత్నించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధ్యాసాధ్యాలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది నోటిఫికేషన్

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పది, ఇంటర్ తరగతుల్లో చేరేందుకు గతేడాది జూలై 31న నోటిఫికేషన్ జారీ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. అపరాధ రుసుం లేకుండా నవంబర్ వరకూ దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అపరాధ రుసుంతో దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం గతేడాది డిసెంబర్ 23 నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న వారి నుంచి పరీక్ష ఫీజును స్వీకరించారు. ఈ విధంగా కాకినాడ జిల్లా నుంచి పదో తరగతికి 2,142 మంది, ఇంటర్‌కు 6,183, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి పదికి 1,103, ఇంటర్‌కు 4,222 మంది, తూర్పుగోదావరి జిల్లా నుంచి పదికి 2,348, ఇంటర్‌కు 4,426 మంది అడ్మిషన్లు పొందారు.



ఓపెన్ స్కూల్ తరగతుల్లో విద్యార్థులు

అందని స్టడీ మెటీరియల్

ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ చదివే విద్యార్థులకు ఏపీ సార్వత్రిక విద్యా పీఠం స్టడీ మెటీరియల్ అందజేస్తుంది. పదో తరగతికి తెలుగు/హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు ఉంటాయి. ఆప్షన్ కోరుకునే వారికి ఇతర సబ్జెక్టులు కూడా తీసుకోవచ్చు. అలాగే ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ,, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంబైపీసీ గ్రూపులకు అవకాశం ఉంది. పది, ఇంటర్‌లో ఆయా కోర్సులు ఎంపిక చేసుకునే అభ్యర్థులకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పాఠ్య పుస్తకాలు అందజేయాలి. అయితే పదో తరగతి కోర్సులో అడ్మిషన్ పొందిన వారికి నేటి వరకూ పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను సరఫరా చేయలేదు. ఇంటర్ అభ్యర్థులకు వారు ఎంచుకున్న గ్రూపుల వారీగా పాఠ్య పుస్తకాలు అందజేయాల్సి ఉండగా, నేటి వరకూ పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదు. అడ్మిషన్ పొందిన వారికి పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో సరఫరా చేయకుండానే మార్చి నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్‌కు, మార్చి 17 నుంచి పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులతో వార్షిక పరీక్షలను వీరికి కూడా నిర్వహించాలని ఏపీ సార్వత్రిక విద్యా పీఠం అధికారులు భావిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు సరఫరా చేయకుండా తాము ఏ విధంగా సబ్జెక్టు ప్రిపేర్ అవుతామంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకేసారి నిర్వహిస్తే ఇబ్బందే..

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా అడ్మిషన్ పొందిన వారికి రెగ్యులర్ విద్యార్థులతో కాకుండా ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించేవారు. రెండేళ్ల ముందు వరకూ రెగ్యులర్ విద్యార్థులతో కాకుండా ప్రత్యేకంగా నిర్వహిస్తుండగా, రెండేళ్ల నుంచి రెగ్యులర్ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు దీనికి భిన్నంగా రెగ్యులర్ విద్యార్థులను, ఓపెన్ స్కూల్ విద్యార్థులను కలిపి ఒకే సమయంలో పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ తరహా విధానంలో రెగ్యులర్ విద్యార్థులకు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కలిపి పరీక్షలు నిర్వహించడం వల్ల గందరగోళ పరిస్థితి తలెత్తే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను సరఫరా చేసి, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు వేరుగా పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాలు అందలేదు



ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఇంటర్‌లో అడ్మిషన్ పొందాను. సీఈసీ గ్రూపులో చేరాను. ఇప్పటి వరకూ పాఠ్య పుస్తకాలు అందలేదు. పాఠ్య పుస్తకాలు లేకుండా ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలో అర్థం కావడం లేదు. అసలు పాఠ్యాంశాలు తెలియకుంటే ఎలా..

– రాయి శ్రీకాంత్, ఇంటర్ అభ్యర్థి, రాయవరం

సమయం ఇస్తే మంచిది



ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్‌లో ఎంపీసీ అడ్మిషన్ తీసుకున్నాను. పాఠ్య పుస్తకాలు మాకు ఇవ్వలేదు. సమయానికి పాఠ్య పుస్తకాలు ఇస్తే ప్రిపేర్ అవ్వడానికి వీలుంటుంది. పాఠ్య పుస్తకాలు లేకుండా ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థం కావడం లేదు. దీనివల్ల పరీక్షల్లో ఇబ్బంది పడతాం.

– చెల్లుబోయిన రామసంతోష్, ఇంటర్ ఎంపీసీ అభ్యర్థి, రావులపాలెం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మత సామరస్యానికి చిహ్నం

- బషీర్‌బీబీ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- వచ్చే నెల 7 నుంచి ప్రారంభం



పొన్నాడలో వేంచేసియున్న బషీర్‌బీబీ (దర్గా)దేవాలయం



బషీర్‌బీబీకి ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై హిందు, ముస్లింల సమైఖ్యతకు చిహ్నంగా చెప్పే బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగే ఈ ఉత్సవాలకు మన ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. దూర ప్రాంతాల భక్తులు మూడు రోజుల పాటు దర్గా ప్రాంగణంలోనే ఉండి ఉత్సవాలు పూర్తయ్యాక వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాపమ్మ) దర్గాకు ప్రత్యేకత ఉంది. ముస్లింలే కాకుండా హిందువులు, క్రైస్తవులతో పాటు కుల, మత భేదాలు లేకుండా అంతా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం. ముస్లింల దేవతైన బషీర్‌బీబీని స్థానికంగా బంగారు పాపమ్మ అని పిలుస్తుంటారు. పూర్వం బషీర్‌బీబీ ఏడు అంతస్తుల భవనంలో ఉండేదని, తన బంగారాన్ని పేదలు శుభకార్యాలు నిర్వహించేటప్పుడు అప్పుగా ఇచ్చేవారని.. శుభకార్యం పూర్తయిన వెంటనే తిరిగి ఆ బంగారాన్ని ఆమెకు ఇచ్చేవారని స్థానికులు చెబుతుంటారు. పేదలకు బంగారం అప్పుగా ఇవ్వడం వల్ల ఆమెకు బంగారు పాపమ్మ అనే పేరు సార్థకమైందని వివరిస్తుంటారు. ప్రస్తుతం పొన్నాడలో ఉన్న బషీర్‌బీబీ దర్గా గతంలో ఏడు అంతస్తులు ఉండేదని, రానురాను ఆరు అంతస్తులు భూమిలోకి కూరుకుపోగా పైఅంతస్తు మాత్రమే కనిపిస్తుందని పెద్దలు చెబుతుంటారు. బషీర్ బీబీని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందువల్ల భక్తులు మూడు రోజుల పాటు అధిక సంఖ్యలో పాల్గొని బషీర్ బీబీని దర్శించుకుంటారు. ఈ మూడు రోజులూ తీర్థం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ముజావర్లు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తారు. ఉన్న ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

భారీ బందోబస్తు

బషీర్ బీబీ ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అధిక సంఖ్యలో భక్తుల వాహనాల వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని చూపనున్నారు. వచ్చే నెల 9న భక్తులు ఇంకా అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉందని, ఆ రోజు రేడియో, టీవీ సింగర్ మధ్య కాంపిటేషన్ ఏర్పాటు చేసినట్లు ముజావర్లు తెలిపారు.

ఉత్సవాల నిర్వహణ ఇలా..

ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ 70వ ఉర్సు ఉత్సవాలు ప్రారంభంమవుతాయి. 9న గంధోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం మూలపేటలకు చెందిన షేక్ మౌలాసాహేబ్ ఇంటి నుంచి గంధాన్ని బ్యాండ్ మేళాలతో గుర్రంపై ఊరేగింపుగా తీసుకొస్తారు. ఆ గంధాన్ని అమ్మవారికి పూసిన అనంతరం భక్తులకు పంచిపెడతారు. మూడు రోజుల పాటు దర్గాలో విశేష ప్రార్థనలు నిర్వహిస్తారు.

మూడు తరాల నుంచి ప్రార్థనలు



ఉర్సు ఉత్సవాలకు భక్తుల తాకిడి పెరుగుతోంది. బషీర్‌బీబీ దర్శించుకుంటే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలను మూడు తరాలకు పైగా మా కుటుంబం వారు నిర్వహిస్తున్నారు. ఇందులో గంధోత్సవం ఎంతో ముఖ్యమైంది. బషీర్‌బీబీకి పూసిన గంధాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

–అబీదా, స్థానిక ముజావరురాలు, పొన్నాడ

మా కోరిక నెరవేరింది



గత ఏడాది బషీర్‌బీబీని దర్శించుకుని సంతానం కలగాలని మొక్కుకున్నాను. నా కోర్కె ప్రకారం పండంటి మగబిడ్డ పుట్టాడు. బీషీర్‌బీబీని కోరుకోవడం వల్లనే నాకు సంతానం కలిగింది. పుట్టిన బిడ్డతో బషీర్‌బీబీ దర్శనం చేసుకుని ఊయలలో బిడ్డను వేసి మొక్కుబడి తీర్చుకున్నా.

–సున్వేరి, భక్తురాలు, కాకినాడ

నేడు టీటీడీసీలో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో 100 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఏదైనా డిగ్రీ కలిగి 18 నుంచి 30 ఏళ్ల స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు తూర్పుగోదావరి జిల్లా అంతా పని చేయాల్సి ఉంటుందని, నెలకు రూ.10 వేల నుంచి రూ.16 వేల జీతం ఉంటుందన్నారు. టీమ్ లీజ్ కంపెనీలో 100 ఉద్యోగాలు ఉన్నాయని, 30 ఏళ్లలోపు వయసు కలిగి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వీరు ఏలేశ్వరం, జగ్గంపేట, ప్రత్తిపాడులలో పనిచేయాలని, నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల జీతం ఉంటుందన్నారు. అదే విధంగా డక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలో 50 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు కలిగిన పురుషులు బీఎస్సీ (కెమిస్ట్రీ) కెమిస్ట్రీలో డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారు తునిలో పని చేయాలని, నెలకు రూ.17 వేల జీతం ఉంటుందన్నారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలోకి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. ఆ గ్రామ శ్మశాన వాటిక సమీపంలో పంట కాలువలో మృతదేహం కనిపించింది. అది కుళ్లిపోయి గుర్తుపట్టేందుకు వీల్లేకుండా ఉంది. వయసు సైతం నిర్ధారించలేని పరిస్థితి. పోలీసులు స్పందించి మృతదేహానికి పోర్టుమార్టం చేయిస్తే విషయం బయటకు వస్తుంది.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



బాల (ఫైల్)

కొత్తపల్లి: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేష్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం మూలపేట గ్రామ ప్రకాష్‌నగర్‌కు చెందిన గింజల బాల (25), అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ ఎనిమిదేళ్ల కిందట ప్రేమించుకుని పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల బాలను భర్త కువైట్ పంపించాడు. ఆమె అక్కడ ఉండలేక మూడు నెలలకే ఇంటికి తిరిగి వచ్చేసింది. అప్పటి నుంచి ఒకరిపై ఒకరికి అనుమానం కలిగింది. ఇటీవల భర్త ప్రసాద్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని, కావాలనే బాలను అత్తంటివారు ఆదివారం ఉరివేసి చంపేసి హుటాహుటిన మృతదేహాన్ని ఖననం చేశారని మృతురాలి తల్లి లక్ష్మి సోమవారం ఫిర్యాదు ఇచ్చింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అంబాజీపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత మనస్తాపం చెంది తన ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. పుల్లేటికుర్రు శివారు లంకతోటకు చెందిన వాసంశెట్టి సీతామహాలక్ష్మి (46) కొన్నేళ్లుగా ఆస్మా, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతుంది. దీనికి తోడు తన కుమార్తెకు బైపాస్ సర్జరీ జరగడం, వ్యవసాయ కూలి పనులు లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమె భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



ప్రమాద ఘటన వద్ద బైక్



ముత్తా సాయి వీరభద్రదుర్గ (మృతుడు)

పమిడిముక్కల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోడను ఢీకొన్న ప్రమాదంలో కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారిపై మంటాడ ఫ్లైఓవర్ వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పాత ఇసుకపల్లికి చెందిన దాసరి నిమ్స్ చంద్ర (21) తన బైక్‌పై కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ముత్తా సాయి వీరభద్ర దుర్గ (22)తో హైదరాబాద్ బయలు దేరాడు. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వస్తుండగా మంటాడ ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చొన్న వీరభద్ర దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రకు తీవ్ర గాయాలవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వెంటాడిన మృత్యువు

కిర్లంపూడి: మండలంలోని రమణయ్యపేటకు చెందిన ముత్తా పెద్దకాపు, సరస్వతీ దంపతులకు ఇద్దరు కుమారులు. తమ కుమారులను బాగా చదివించి ప్రయోజకులను చేయాలనే తపనతో కష్టపడి చదివించారు. వారి చిన్న కుమారుడు సాయి ఆరు నెలల కిందట కిర్లంపూడి– రాజుపాలెం రోడ్డుపై బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. అల్లారి ముద్దుగా చూసుకున్న చిన్న కుమారుడు మరణంతో ఆ తల్లిదండ్రులు కుంగిపోయారు. ఆ ఘటన నుంచి తేరుకునే లోపు పెద్ద కుమారుడు ముత్తా సాయి వీరభద్రదుర్గ సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతను డిప్లొమా చేసి నాలుగు నెలల క్రితమే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో చేరాడు. తన కుమారుడికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్ వచ్చిందనే ఆనందంతో ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు. మరింత ఉన్నత స్థాయిలో చూసుకుని విశ్రాంతి తీసుకుందామనుకునే లోపే ఈ ఘటన ఆ కుటుంబాన్ని కుదిపేసింది. సంక్రాంతి పండగకు ఈ నెల 11న కిర్లంపూడి వచ్చి కుటుంబ సభ్యులు, స్నేహితులతో వీరభద్రదుర్గ ఎంతో ఉత్సాహంగా గడిపాడు. సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలసి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగి అక్కడికక్కడే మరణించాడు.

పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు



పంట పొలాల్లోకి దూసుకుపోయి ఆగిన ట్రావెల్ బస్

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. బస్సు టైర్ పేలి, అదుపుతప్పి డివైడర్ పైనుంచి, ఎదురు మార్గంలోకి పోయి, రెయిలింగ్‌ను ఢీకొని పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ప్రయాణికుంతా క్షేమంగా బయట పడ్డారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు 47 మంది ప్రయాణికులతో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్ బస్ టైర్ ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో పేలిపోయింది. దీంతో బస్ అదుపుతప్పి డివైడర్‌ను దాటి పక్క రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొని, పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటన నుంచి డ్రైవర్‌తో సహా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరకుని, పరిస్థితిని సమీక్షించారు. బస్ టైర్ పేలడం మినహా అంతా క్షేమమన్నారు.

ఏసీ మెకానికర్‌పై యువకుల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను పరామర్శిస్తున్న దళిత నాయకులు

అమలాపురం టౌన్: ఓ ఏసీ మెకానికర్‌పై ఐదుగురు ఇంటర్ చదివిన యువకులు దాడి చేశారు. ఆదివారం రాత్రి స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో ఈ ఘటన జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట మండలం పశువుల్లి గ్రామానికి చెందిన ఏసీ మెకానికర్ గంటి కిరణ్ ఏసీకి చెందిన ఓ పరికరాన్ని కొనుగోలు చేసేందుకు అమలాపురానికి వచ్చాడు. కొంత సమయం పడుతుందని షాపు నిర్వాహకులు తెలపడంతో సమీపంలో ఉన్న బజ్జీల బండి వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న ఐదుగురు యువకులు ఏసీ మెకానికర్‌తో అకారణంగా గొడవ పడి దాడికి దిగారు. ముఖానికి గాయమైన కిరణ్ చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. మెడికో లీగల్ కేసుగా పరిగణించి అతనికి వైద్యులు చికిత్స చేశారు. దీనిపై బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏసీ మెకానికర్‌ను జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, వీసీకే పార్టీ కార్యదర్శి బొంతు రమణ, నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్‌ఛార్జి పాలమూరి మోహన్ బాబుతో కూడిన బృందం సోమవారం సాయంత్రం పరామర్శించింది. ఏసీ మెకానికర్‌పై దాడి చేస్తున్నప్పుడు ఆ యువకుల్లో ఒకరు 'నేను మంత్రి వాసంశెట్టి సుభాష్ రైట్ హ్యాండ్ కొడుకుని అంటూ దాడి చేశారని' బాధితుడిని పరామర్శించిన దళిత నాయకులు తెలిపారు. అకారణంగా దాడి చేసిన యువకులను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నిందితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ వీరబాబు విచారించారు.

ప్రైవేట్ బస్సులపై కేసులు



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

అమలాపురం రూరల్: సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో 126 బస్సులపై కేసులు నమోదు చేసి మోటారు వాహన చట్టం కింద రూ. 8,09,675 అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి దేశనీడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసిన బస్సు యజమానులపై 56 కేసులు నమోదు చేశారు. ఇతర క్రమరాహిత్యం కింద 71 కేసులు పెట్టామన్నామన్నారు. ఈ తనిఖీల్లో మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, సురేష్ కుమార్, లక్ష్మీ శ్రీదేవి, కాశీ విశ్వేశ్వరరావు, షణ్ముఖ శ్రీనివాస్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోకవరం: గోకవరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెంటపల్లికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ (23) మృతి చెందాడు. ఆ వివరాల ప్రకారం.. గోకవరంలో సినిమా చూసేందుకు టిక్కెట్ల కోసం దుర్గాప్రసాద్ బైక్‌పై వచ్చాడు. టిక్కెట్లు తీసుకున్న అనంతరం తన స్నేహితుడిని సినిమాకు తీసుకు వచ్చేందుకు వీరలంకపల్లి వెళ్తుండగా గోకవరంలో పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి, తండ్రి ఉన్నారు. చేతికందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

- అపచారానికి కారకులను కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి



మధురపూడి: పవిత్ర పుణ్యక్షేత్రం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన అపచారంపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. తొలుత స్వామివారి పాదాలకు పసుపునీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. చరిత్ర కలిగిన స్వామివారి ఆలయంలో మద్యం సీసాలు, మాంసం వంటివి ఉన్నాయని చెబుతున్నారని, ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతుందన్నారు. అయినా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతామన్న జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అపచారంపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. తన కుమారుడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా హయాంలో నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే 117 దేవాలయాలకు శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. మరో నాలుగు దేవాలయాలకు కామన్‌గుడ్ ఫండ్ నుంచి నిధులు తెచ్చారన్నారు. సీతానగరం మండలం కాటవరం శివాలయం, మండలంలోని మరికొన్ని దేవాలయాలున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజా హయాంలో స్వామివారి గిరి ప్రదక్షిణ నిమిత్తం రోడ్డు నిర్మిస్తే, దాని నిర్వహణ పనులు జరగడం లేదన్నారు. అన్నవరం దేవస్థానం సహకారంతో మెట్లు నిర్మాణానికి మార్గం సుగమం చేశారని, అలాగే రంగనాథ స్వామివారి ఆలయ నిర్మాణానికి అనుమతులు తెచ్చారని, ఐదు అంతస్తుల రాజగోపురం, పైన ప్రాకార మండపాన్ని విస్తరించడానికి అనుమతులు తెచ్చారన్నారు. ఆ సందర్భంగా చినజీయర్ స్వామి కూడా వచ్చినట్టు గుర్తుచేశారు. ఎన్నికలు రావడంతో కొనసాగింపు నిలిచిపోయినట్టు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. భక్తుల్లో అనుమానాలు నివృత్తి చేయాలని, అపచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ కోకన్వీనర్ గణేశుల పోస, నాయకులు గుమ్ములూరు సర్పంచ్, నక్కా రాంబాబు, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, కొండపల్లి దుర్గారావు, బొరుసు బద్రీ, కంటే వినయ్‌తేజ, పసుపులేటి బుల్లియ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిది హత్యే..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం తోటపేటలోని తోట త్రిమూర్తులు కాలనీలో అనుమానాస్పదంగా మృతి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి (54)ని బంగారం కోసం హత్య చేశారని రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ సోమవారం వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. తోట త్రిమూర్తులు కాలనీకి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి తన ఇంట్లో ఈ నెల 12న మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ద్రాక్షారామ శ్మశాన వాటికలో పూడ్చిపెట్టారు. అనంతరం మహాలక్ష్మి మృతిపై బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పూడ్చిపెట్టిన శవానికి పోస్టుమార్టం చేయగా మహాలక్ష్మిని హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం పోలీసుల దర్యాప్తులో అదేకాలనీకి చెందిన నాగిరెడ్డి అప్పారావు అనే వ్యక్తి మహాలక్ష్మిని గొంతు నొక్కి హత్య చేసి ఆమె మెడలోని చైన్, వేలి ఉంగరం దొంగిలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు మహాలక్ష్మి బంధువు సలాది సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

లంచం తీసుకున్న పోర్ట్ ఆఫీసర్‌కు రెండేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కాకినాడ పోర్ట్ ఏరియాలో స్థలాన్ని కేటాయించేందుకు రూ.2 లక్షలు లంచం తీసుకున్న పోర్ట్ ఆఫీసర్ మనం వెంకట కృష్ణమోహన్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. అట్లాస్ ఆఫ్‌షోర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన షేక్ అహ్మద్‌బాషా తనకు పోర్ట్ ఏరియాలో స్థలం కేటాయించాలని కాకినాడ కమిషనర్ ఆఫ్ పోర్ట్ కార్యాలయం, పోర్ట్ ఆఫీసర్ మనం వెంకట కృష్ణమోహన్‌ను అనుమతి కోరాడు. దీనికి గాను వెంకట మోహన్‌కృష్ణ రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై షేక్ అహ్మద్‌బాషా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు వలపన్ని వెంకట కృష్ణమోహన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేర నిరూపణ కావడంతో అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ ఏ ప్రకారం ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధించారు. అలాగే యూఎస్ 13 (1), (డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పునిచ్చారు.

వ్యక్తికి ఐదేళ్ల జైలు

గోకవరం: ప్రేమిస్తున్నానని శారీరకంగా వేధించి యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి రాజమహేంద్రవరం పదో అదనపు జిల్లా సెషన్స్ కమ్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధించింది. గోకవరం ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని శారీరకంగా ఇబ్బంది పెట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. దీనిపై 2015లో అప్పటి ఎస్సై శివాజీ కేసు నమోదు చేయగా, నార్త్‌జోన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.